క్లుప్తంగా

హద్దు రాళ్ల తొలగింపు

కావలి : పట్టణంలోని మద్దూరుపాడులో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసి ఇళ్ల ప్లాట్లు సైతం అమ్మకాలు చేసిన రియల్‌ఎస్టేట్ వెంచర్‌లోని హద్దురాళ్లను మున్సిపల్ కమిషనర్ శుక్రవారం తొలగించారు. వెంచర్‌కు సంబంధించిన అనుమతులు అసంబద్ధంగా ఉండడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

కలిగిరి: మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మెట్టుకూరి శిరీష అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

20న దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఈ నెల 20న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి సంబంధించి ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ, సంయుక్త ప్రాంతీయ కేంద్రం, నెల్లూరు ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించనున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి ప్రభుత్వం త్రిచక్ర వాహనాలు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, తదితర ఉపకరణాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌తో పాటు రేషన్, ఆధార్‌కార్డులు, వయో వృద్ధులు రేషన్, ఆధార్‌కార్డులు, రెండు ఫొటోలు తీసుకుని రావాలని కోరారు.

యూపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత ఉప్పలపాడు


కప్పుతో విజేతగా నిలిచిన ఉప్పలపాడు జట్టు

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులో సంక్రాంతిని పురస్కరించుకుని ప్రముఖ కాంట్రాక్టర్ ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో వారం రోజుల పాటు నిర్వహించిన యూపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. చివరిరోజు హోరాహోరీగా సాగిన ఫైనల్‌మ్యాచ్‌లో పెన్నాబద్వేల్ జట్టుపై ఉప్పలపాడు జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.15వేలు, రన్నర్ జట్టుకు రూ.10వేలు నగదు బహుమతులను ఊరిబిండి మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్ నిర్వాహకులు శేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



ఉదయగిరి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉన్నత పాఠశాల కేంద్రంలో 284 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు 11 గదులు ఏర్పాటు చేసి 11 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లుగా తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌గా హెచ్‌ఎం బాలకేశవులు, డిపార్ట్‌మెంటల్ అధికారిగా యమునాలక్ష్మి వ్యవహరించనున్నట్లు చెప్పారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఇన్విజిలేటర్లు పది గంటలకు, విద్యార్థులు గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

సీడీపీఓ బాధ్యతల స్వీకరణ



ఉదయగిరి: ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓగా టీ శారద శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఐసీడీఎస్ కావలి ప్రాజెక్ట్‌లో ఏసీడీపీఓగా పనిచేస్తున్న ఆమెను ఎఫ్‌ఏసీపై ఉదయగిరి సీడీపీఓగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని లబ్ధిదారులకు అంగన్‌వాడీ సేవలను అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రాజెక్టు పరిధిలోని కార్యకర్తలు, ఆయాలు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

అల్లూరు: రబీ పంట సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని ఇందుపూరులో వరిపంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు.

పాత బైక్‌లు కొంటున్నారా..
తస్మాత్ జాగ్రత్త

పట్టణంలో చెలరేగిపోతున్న బైక్ దొంగలు

పట్టణానికి చెందిన ఓ వ్యక్తి వాడే బైక్‌కు కొన్ని స్పేర్ పార్టులు కావాల్సి వచ్చాయి. కొత్తవి కొనే ఆర్థిక స్తోమత లేక సర్దుబాటు చేసుకుని వాడుకుంటున్నాడు. ఈ క్రమంలో తెలిసిన వ్యక్తి తాను కొత్త బైక్ కొంటున్నానని, తన పాత బైక్‌ను అమ్మేస్తున్నానని చెప్పడంతో పాత బైక్‌లో ఉండే స్పేర్ పార్టులు తన బైక్‌కు సరిపోతాయని భావించి దాన్ని కొనుగోలు చేశాడు. అందులోని స్పేర్ పార్టులు తన బైక్‌కు బిగించుకోక ముందే పోలీసులు సదరు వ్యక్తి ఇంటికి వచ్చారు. పోలీస్ స్టేషన్‌కు పదా పని ఉందంటూ తీసుకెళ్లారు. అక్కడ తనకు బైక్‌ను విక్రయించిన వ్యక్తిని చూపించారు. అతని వద్ద బైక్‌ను కొన్నావా అని అడిగారు పోలీసులు. అవును అని చెప్పగా నువ్వు కొన్నది దొంగతనం చేసిన బైక్ అని పోలీసులు చెప్పడంతో సదరు వ్యక్తి లబోదిబోమన్నాడు. తెలిసిన వ్యక్తి అని కొన్నానని, అసలు ఆ బైక్‌ను వాడనే లేదని, తన వద్దనే ఉందని పోలీసులకు ఇచ్చేశాడు. ఈ వ్యవహారంలో సదరు వ్యక్తి డబ్బులు పోయాయి. స్పేర్ పార్టులు దక్కలేదు. పోలీసుల కాళ్లావేళ్లా పడాల్సి వచ్చింది.



పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థికి బైక్‌పై తిరగాలని కోరిక. కానీ కుటుంబ ఆర్థిక పరిస్థితి వల్ల తన కోరిక తీరదని భావించాడు. అయినా ఆ కోరిక తీర్చుకోవాలనే దుర్బుద్ధి మాత్రం వీడలేదు. పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత జన సంచారానికి దూరంగా పార్కింగ్ చేసి ఉన్న బైక్‌ను గమనించాడు. ఆ బైక్‌ను తీసుకెళ్లాలని నిశ్చయించుకుని, నడపడానికి ప్రయత్నించగా అది స్టార్ట్ కాలేదు. బైక్‌ను నెట్టుకుంటూ వెళ్లసాగాడు. పోలీస్ స్టేషన్ మీదుగా వెళ్తున్న క్రమంలో విద్యార్థిని గమనించిన పోలీసులు ఆపారు. ఏమైంది నెట్టుకుంటూ వెళ్తున్నావని ప్రశ్నించగా స్టార్ట్ కాలేదని చెప్పాడు. తాము స్టార్ట్ చేసి ఇస్తామని, తాళం ఇవ్వాలని పోలీసులు అడుగగా లేదన్నాడు. దీంతో విద్యార్థిపై అనుమానం వచ్చి స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా బైక్‌ను దొంగతనం చేసి ఎత్తుకెళ్తున్నట్లుగా తెలిసింది.

- బైక్‌ల అపహరణ.. నకిలీ పత్రాలతో విక్రయం
- వాటిని కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్న బాధితులు
- పోలీసు కేసుల్లోనూ ఇరుక్కుంటున్న వైనం
- పాతబైక్‌ల పత్రాలను తనిఖీ చేసుకోవాలని సూచిస్తున్న పోలీసులు

కావలి: పట్టణంలో బైక్ దొంగలు చెలరేగిపోతున్నారు. పట్టణంలోని బ్యాంకులు, జనతాపేటలోని విద్యార్థుల అద్దె గదులు, ట్రంకురోడ్డులోని షాపులు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద, ఇళ్ల ముందు పార్కు చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని అపహరించుకెళ్తున్నారు. మారుతాళాలు, వైర్లు కత్తిరించడం ద్వారా వాహనాలను క్షణాల్లో మాయం చేస్తున్నారు. వాటికి నకిలీ పత్రాలను సృష్టించి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో అపహరించిన వాహనాలను సైతం కావలికి తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఈ విషయం తెలియక వాహనాలను కొనుగోలు చేసి పలువురు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పోలీసు కేసుల్లోనూ చిక్కుకుంటున్నారు.

ఏడాది కాలంలో 150కుపైగా..

కావలి పట్టణ పరిధిలో మూడు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో గత ఏడాది కాలంలో సుమారు 150 బైక్ దొంగతనాలు జరిగాయి. అందులో 50 బైక్ దొంగతనాలకు సంబంధించి మాత్రమే కేసులు నమోదయ్యాయి. మిగిలిన బైక్‌లకు సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కాలేదు. పట్టణంలో దొంగతనం చేసిన బైక్‌లను దొంగలు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాల్లో దొంగతనం చేసిన బైక్‌లను కావలిలో అమ్మకాలు చేస్తున్నారు.

నకిలీ పత్రాలతో విక్రయాలు

దొంగలించిన బైక్‌లకు నకిలీ పత్రాలను సృష్టించి అమ్మేస్తున్నారు. పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టిన సమయంలో నకిలీ పత్రాల విషయం వెలుగులోకి వస్తోంది. సరైన పత్రాలు లేకుండా బైక్‌లు కొనుగోలు చేసిన వారు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు కొన్ని సందర్భాల్లో కేసుల్లో కూడా చిక్కుకుంటున్నారు. చిరు వ్యాపారులు, చిన్న చిన్న ఉపాధి పనులు చేసుకునే వారు కొత్త బైక్‌లు కొనుగోలు చేయలేక రూ.10వేల నుంచి రూ.20వేల లోపల చౌకగా పాత బైక్ వస్తుందని కొనుగోలు చేస్తున్నారు. పాత బైక్‌ల పత్రాలను రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించుకుని, వారి నుంచి పత్రాలు ఒరిజినల్ అని నిర్ధారించుకున్న తర్వాతనే వాటిని కొనుగోలు చేయాలి. కానీ ఇవేవీ పట్టించుకోకుండా పాతబైక్‌లను కొనుగోలు చేసి మోసపోతున్నారు. పోలీసులకు దొంగలు దొరికినప్పుడు మాత్రం ఈ నిబంధనలన్నీ తమకు తెలియవని, తెలిసిన వ్యక్తి సలహా ఇవ్వడంతో కొనుగోలు చేశానని అమాయకపు మాటలు చెప్పి తప్పించుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాత బైక్ లు కొనేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యంగా పాత బైక్‌లు చౌకగా వస్తున్నాయని కొనుగోలు చేస్తే కేసుల్లో ఇరుకుంటారు. రూ. లక్ష నుంచి రూ. ఒకటిన్నర లక్ష విలువ చేసే బైక్‌లు కేవలం రూ. 10వేలకు అమ్ముతున్నారంటేనే అనుమానించాలి. పాత బైక్ కొనేటప్పుడు వాటికి సంబంధించిన పత్రాలు ఖచ్చితమైనవా..కాదా అని తనిఖీ చేసుకోవాలి.

– ఎండీ ఫిరోజ్, సీఐ, ఒకటో పట్టణం

తిరుపతినాయుడుపల్లి యువతికి డాక్టరేట్



చేజర్ల: మండలంలోని తిరుపతినాయుడుపల్లికి చెందిన స్వప్న డాక్టరేట్ పొందారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగం ప్రొఫెసర్ మామిళ్ల రాజశేఖర్ మార్గదర్శకత్వంలో 'మార్కెటింగ్ స్ట్రాటజీస్ ఆన్ సెవన్ పీస్ ఆఫ్ షాపింగ్ మాల్స్ ఇన్ ఇండియా ఏ స్టడీ విత్ రెఫరెన్స్ టూ బెంగుళూరు నగరం' అనే అంశంపై ఆమె పరిశోధనలు చేసి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అందుకుగానూ శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా స్వప్నను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

గోవా మద్యం స్వాధీనం

కావలి: కావలి మండలం పెద్దపట్టపుపాళెం గ్రామంలో ప్రళయకావేరి ప్రసాద్ అనే వ్యక్తి వద్ద 60 గోవా మద్యం బాటిళ్లు ఉండగా శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ ఎస్.శ్రీనివాసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సోమశిల: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి సూచించారు. అనంతసాగరం పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితి మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు. ఓవర్‌లోడ్, మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ


హుండీని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు


సీసీపుటేజీలో చోరీకి పాల్పడిన దొంగలు

మర్రిపాడు: మండలంలోని పొంగూరులోని పోలేరమ్మ ఆలయంలో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. గుర్తుతెలియని దొంగలు ఆలయ హుండీని వెనుక వైపు ఉన్న ముళ్ల చెట్లలోకి తీసుకెళ్లి పగులగొట్టి నగదును అపహరించారు. శుక్రవారం చోరీని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని కంపచెట్లలోని హుండీ, సీసీకెమెరాలను పరిశీలించారు. మధ్యాహ్నం వేళ ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీ చేసినట్లుగా సీసీ కెమెరాలో రికార్డు అయింది. పట్టపగలే ఆలయంలో చోరీకి పాల్పడడంపై మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు సహకారం


వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీపీ శిరీష

కలిగిరి: కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు తమవంతు సహకారాన్ని అందిస్తామని ఎంపీపీ మెట్టుకూరి శిరీష తెలిపారు. కలిగిరి పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తామన్నారు. వైద్యశాల అభివృద్ధికి తోడ్పాటును అందజేస్తామన్నారు. అనంతరం పీహెచ్‌సీ అభివృద్ధికి సంబంధించిన తీర్మానాలను ఆమోదించారు. అనంతరం ల్యాబ్, ఫార్మసీ, రోగుల గదులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి, వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై సర్వేను పక్కాగా చేపట్టాలి

వరికుంటపాడు/అనుమసముద్రంపేట: వరికుంటపాడు, అనుమసముద్రంపేట మండలాల్లోని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టుపై నిర్వహించనున్న సర్వేను వైద్యారోగ్య సిబ్బంది పక్కాగా చేపట్టాలని వరికుంటపాడు, ఏఎస్‌పేట పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆయేషా, సురేష్‌బాబు సూచించారు. వరికుంటపాడు, ఏఎస్‌పేట పీహెచ్‌సీల్లో కుష్టు సర్వేపై వైద్యారోగ్య సిబ్బందికి శుక్రవారం వారు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటిని సర్వే బృందం సందర్శించి కుటుంబ సభ్యులను పరీక్షించాలని సూచించారు. శరీరంపై స్పర్శలేని, రాగి రంగు మచ్చలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీకి పంపి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కుష్టును ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో హెల్త్‌సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాలీ ఎక్కిన బోటు



నీటిపై తేలియాడాల్సిన బోటు రోడ్డుపై ట్రాలీలో దర్శనమిచ్చింది. బాపట్ల జిల్లా నుంచి వైఎస్సార్ జిల్లాకు ట్రాలీపై తరలిస్తున్న బోటు కావలి పట్టణంలో శుక్రవారం కనిపించింది. –కావలి

నేడు స్వచ్ఛ దివస్

ఆత్మకూరు: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పట్టణంలోని టెంకాయతోపు వద్ద స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం 6 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆత్మకూరు మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చేందుకు చేపడుతున్న స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు



ఉదయగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపల్లెలో విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఇళ్లపై చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఆదమరిచి చేతులు పైకెత్తితే ప్రమాదం సంభవించే అవకాశం ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను పక్కకు మార్చాలని కోరుతున్నారు.

కిశోర బాలికలు అప్రమత్తంగా ఉండాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఆత్మకూరు: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఘటనలపై కిశోర బాలికలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత సూచించారు. పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో కిశోర బాలికల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సునీలత మాట్లాడుతూ కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లల భవిష్యత్, ఆరోగ్య పరిరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. వాటిని కిశోర బాలికలకు చేరువ చేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలపై ఉందన్నారు. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు, వసతిగృహాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారు చదువుపై దృష్టి సారించి భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. ఆడపిల్లలకు కొందరు మాయమాటలు చెప్పి అక్రమ రవాణా చేస్తుంటారని, అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత అన్న వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, అర్బన్, రూరల్ పీహెచ్‌సీల వైద్యులు ఎస్‌కే అష్మా, అనూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రత్నమ్మ, నారాయణమ్మ, నాగేశ్వరి, పద్మావతి, డాక్టర్ లలితమ్మ, ఎన్‌జీఓ శ్రీహరి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి


కళాశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. కళాశాలలో త్వరలో రూ.5 కోట్లతో చేపట్టనున్న నూతన భవనాలు, ల్యాబ్, ప్రహరీ, తదితర నిర్మాణాలకు సంబంధించి స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు రూపొందించిన భవన నిర్మాణాల ప్లాన్‌లను పరిశీలించి సూచనలు చేశారు. కళాశాల ప్రాంగణం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం గమనించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టి శుభ్రంగా ఉంచాలని సూచించారు. పనుల నాణ్యతా ప్రమాణాల విషయంలో కాంట్రాక్టర్, అధికారులు రాజీపడరాదన్నారు. నిధులను దశలవారీగా ప్రాధాన్యత క్రమంలో వినియోగించాలన్నారు. నిధులు సరిపోకపోతే తన ఎమ్మెల్యే నిధులు, ఎంపీ నిధులతో కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. పంచాయతీ బస్టాండ్ కూడా అధ్వానంగా ఉందని, దానిని అభివృద్ధి చేస్తామన్నారు. ఒకటిన్నర సంవత్సర కాలంలో ఉదయగిరి నియోజకవర్గంలో సీసీ రోడ్లను పూర్తిచేస్తామన్నారు. ఉదయగిరి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించానని, భవిష్యత్‌లో రూపురేఖలు మార్చుతానన్నారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ నరసింహులు, ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల పాలనలో రైతులు సుభిక్షం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బోడె రామచంద్రయాదవ్

దుత్తలూరు: శ్రీకృష్ణదేవరాయల పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. నర్రవాడ సమీపంలోని యాదవ చైతన్య వేదిక ప్రాంగణంలో శ్రీకృష్ణ దేవరాయల జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామచంద్రయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయలు తన కాలంలో అత్యధికంగా చెరువులు, కుంటలను నిర్మించి కరువు కాటకాలను నివారించారన్నారు. ఆయన పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. శ్రీకృష్ణదేవరాయల వారసులు ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేవలం రెండు కుటుంబాలకే అధికారం పరిమితం కాకుండా అన్ని వర్గాల వారికి అధికారం వస్తేనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా యద్దనపూడి వెంకటరత్నం రచించిన యదువంశ రాజవంశస్తుడు శ్రీకృష్ణ దేవరాయల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉదయగిరి జెడ్పీటీసీ మోడి రామాంజనేయులు, వెలుగొండ ప్రాజెక్టు సాధన కమిటీ సభ్యుడు డాక్టర్ శ్యాంప్రసాద్, బీసీ నాయకులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతి జలగలు

రూ.13.66 లక్షలు స్వాహా

- సోషల్ ఆడిట్‌లో తేలిన అవినీతి
- ఇద్దరు టీఏలు, ఈసీ సస్పెన్షన్
- మరో నలుగురు ఎఫ్‌ఏలకు షోకాజ్ నోటీసులు
- సామాజిక ప్రజావేదికలో డ్వామా పీడీ కే గంగాభవానీ వెల్లడి


సామాజిక తనిఖీ ప్రజావేదికలో పనులపై విచారణ జరుపుతున్న అధికారులు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలంలో ఏడాది కాల వ్యవధిలో చేపట్టిన ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై డ్వామా పీడీ కె.గంగాభవానీ ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక ఈసీని సస్పెండ్ చేశారు. మరో నలుగురు క్షేత్ర సహాయకులపై చర్యలు తీసుకునే నిమిత్తం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. డ్వామా పీడీ కె.గంగాభవానీ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ అధికారులు గత నెల 27 నుంచి ఈ నెల 9వ తేదీ వరకు పంచాయతీల వారీగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గుర్తించిన అవినీతి, అక్రమాల నివేదికను ప్రజావేదికలో పీడీ ముందు డీఆర్పీలు చదివి వినిపించారు. 12 పంచాయతీల్లో వివిధ శాఖలకు సంబంధించి 853 పనులు చేయగా, అందులో ఉపాధి కూలీలకు వేతనాలు రూ.9.79 కోట్లు, సామగ్రి పనుల కింద రూ.1.60 కోట్లు ఖర్చు చేశారు.

గర్తించింది రూ.కోట్లలో... తేల్చింది రూ.లక్షల్లో

సోషల్ ఆడిట్ బృందం గ్రామ స్థాయిలో జరిగిన పనుల్లో కొలతల్లో తేడాలు, బినామీ మస్తర్లు వేయడం తదితర అక్రమాలు గుర్తించారు. క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్ బృందం గుర్తించిన అవినీతికి, ప్రజావేదికలో తేల్చిన అవినీతికి పొంతన కనపడలేదు. సోషల్ ఆడిట్ బృందం గుర్తించిన అవినీతిని ప్రజావేదికలో డ్వామా అధికారులు కప్పెట్టేసి తక్కువగా చూపించారు. సోషల్ ఆడిట్ బృందం రూ.1,11,35,122 అవినీతి జరిగినట్లు గుర్తించగా , ప్రజావేదికలో డ్వామా అధికారులు దానిని కేవలం రూ.13,66,433లకు తగ్గించారు. ఇందులో మరో రూ.50 లక్షలకు సంబంధించి విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేసి తుది నివేదిక ఇవ్వాలని డ్వామా పీడీ తేల్చారు. ఈ ప్రజావేదికలో విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎస్సార్పీ నీలకంఠుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పరులపై చర్యలు

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ తెలిపారు. రూ.లక్ష కంటే ఎక్కువ అవినీతికి పాల్పడిన ఉపాధి సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. వింజమూరులో ఇద్దరు టీఏలు మహేష్, సునీల్, ఈసీ రామ్మోహన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో నలుగురు క్షేత్రసహాయకులకు ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి సస్పెండ్ చేస్తామని తెలిపారు. అవినీతి జరిగిన ప్రతి రూపాయి రికవరీ చేస్తామని తెలిపారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు షీల్డ్‌లు అందజేస్తున్న బొమ్మిరెడ్డి తారకనాథ్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న సంక్రాంతి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పట్టణంలోని ఉన్నత పాఠశాల క్రీడామైదానం (సీతారామ్ ఏచూరి ప్రాంగణం) లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. బీఎ స్టార్ ట్రస్ట్ నిర్వాహకుడు బొమ్మిరెడ్డి తారకనాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏటా సంక్రాంతి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

విజేతలు వీరే..

క్రికెట్‌లో ఢిల్లీ బాయ్స్ జట్టు విజేతగా, లెవన్ హార్స్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఫుట్‌బాల్‌లో ఆత్మకూరు ఫుట్‌బాల్ క్లబ్ జట్టు విజేతగా, సెవన్ రేజెస్ జట్టు రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో పెంచలయ్య జట్టు విజేతగా, ఈశ్వర్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. షటిల్ పోటీల్లో కృష్ణతేజ, శివకుమార్ విజేతలుగా, షబ్బీర్, వెంకట్ ద్వితీయ స్థానంలో, జగదీష్, మాలకొండయ్య తృతీయ స్థానంలో నిలిచారు. క్రికెట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అజయ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌ను తేజ దక్కించుకున్నారు. సీఐటీయూ నాయకులు జీవీ శివప్రసాద్, పెంచలరావు, హజరత్తయ్య, ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సందానీ, యూటీఎఫ్ నాయకులు హెచ్ మురళీకృష్ణ, కే సురేష్, ఎస్‌కే మహబూబ్‌బాషా, డీవైఎఫ్ఐ నాయకులు రిచర్డ్, నందా శ్రీను, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.